ప్రజాశక్తి
గురువారం 22 ఆగస్టు 2024 5
శ్రీ సత్యసాయి



భారత్‌బంద్ సందర్భంగా పటిష్ట బందోబస్తు : ఎస్పీ

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

భారత్ బంద్ సందర్భంగా శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట చర్యలు తీసుకున్నట్లు ఎస్పీ వి. రత్న తెలిపారు. జిల్లాలో ఎక్కడ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ పై సుప్రీం కోర్టు తీర్పు కు వ్యతిరేకంగా భారత్ బందుకు పిలుపునివ్వగా రోజువారి ప్రజా జీవనానికి ఎటువంటి ఆటంకాలు, ఇబ్బందులు కలగకుండా తెల్లవారుజాము నుంచే డీఎస్పీలు, సిఐలు, ఎస్ఐలు, సిబ్బంది, స్పెషల్ పార్టీల ఆధ్వర్యంలో బస్‌స్టేషన్లు, రైల్వేస్టేషన్లు, బ్యాంకులు, తదితర ప్రాంతాలలో బందోబస్తు ఏర్పాలు చేశామన్నారు. ప్రభుత్వ , ప్రైవేటు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, జిల్లా కార్యాలయాల్లో యథావిధిగా విధులు నిర్వహించేందుకు కార్యాలయాల వద్ద భద్రత ఏర్పాట్లు చేసినట్లు ఈసందర్భంగా ఎస్పీ తెలిపారు.

అమలుకు నోచని ప్లాస్టిక్ నిషేధం





జిల్లాలో విచ్చలవిడిగా వినియోగం
తనిఖీలతో సరిపెడుతున్న అధికారులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘంతో పాటు జిల్లా వ్యాప్తంగా ప్లాస్టిక్ నిషేధం అమలుకు నోచుకోవటం లేదు. దీనిని కఠినంగా అమలు చేయాల్సిన అధికారులు, సచివాలయ శానిటేషన్ సెక్రటరీలు తనిఖీలతో సరిపెడుతున్నారన్న విమర్శలు వినపడుతున్నాయి. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల్ని ఎక్కడ అమ్మకుండా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ నిషేధించిన ప్లాస్టిక్ కవర్లను విచ్చల విడిగా వాడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా అమ్మకాలు జరుపుతూ పట్టుబడితే వారి కమర్షియల్ లైసెన్సును రద్దు చేసే అవకాశం ఉంది. 50 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉండే ప్లాస్టిక్ సంచులను సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌గా పరిగణిస్తారు. అంటే రోజూ మనం వాడి పారేసే స్ట్రాలు, ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్, ప్లాస్టిక్ సంచులు, సోడా బాటిళ్లు, ప్లేట్లు, కప్పులు, ఆహారం ప్యాకేజీ కంటెయినర్లు, ఇయర్ బడ్ విత్ ప్లాస్టిక్ స్టిక్స్, సిగిరెట్ ఫిల్టర్స్, లాలీపాప్, చాక్లెట్లకు వాడే ప్లాస్టిక్ పుల్లలు, ఐస్‌క్రీమ్ స్టిక్స్, థర్మో కోల్, 100 మైక్రాన్ల లోపు మందం గల పివిసి బ్యానర్లు, ప్లాస్టిక్ ఇన్విటేషన్ కార్డులు తదితర 16 రకాల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులపై కేంద్రం నిషేధం విధించింది. అయినప్పటికి గ్రామ స్థాయి నుంచి పట్టణ, నగర స్థాయి వరకు ఎక్కడ ఈ నిషేధం అమలు చేయడం లేదు. ఇది చాలదన్నట్లు పట్టణంలో కొంత మంది ఇడ్లీ చేసే సమయంలో సైతం ప్లాస్టిక్ పేపర్ వాడుతున్నారు. హోటళ్లలో సైతం కూరలు, టీ పార్సిల్ సైతం ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్నారు. ఇది తెలిసినప్పటికి మున్సిపల్, ఆహార భద్రత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

పేరుకుపోతున్న ప్లాస్టిక్ భూతం

స్వచ్ఛ భారత్ మిషన్, స్వచ్ఛ సర్వేక్షన్ వంటి కార్యక్రమాలు జిల్లాలో నగరాలు, మున్సిపాలిటీల్లో అమలవుతున్నా విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం జరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో అన్ని పంచాయతీల్లో రోజుకి సుమారు 11 టన్నులకు, పట్టణాలు, నగరాల్లో అయితే దాదాపు 60 టన్నులకు పైగా ప్లాస్టిక్ వ్యర్థాల ఉత్పత్తి జరుగుతుంది. వీటితో ప్రజారోగ్యం దెబ్బతింటోంది. హిందూపురం పురపాలక సంఘంలో 38వార్డుల్లో సుమారు 1. 90 వేల మంది జనాభా ఉండగా ఇక్కడ అనేక మంది నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్‌ను వాడుతున్నారు. వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లలో చెత్తను నింపి రోడ్లపై వేస్తున్నారు. పలు ప్రాంతాల్లో డ్రైనేజీలు ప్లాస్టిక్ వ్యర్థాలతో దర్శనమిస్తున్నాయంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక్కడ దాదాపు 2 లక్షలకుపైగా ప్లాస్టిక్ కవర్లు, ఇతర నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు ఒక రోజులో వినియోగమవుతున్నట్లు అంచనా. ఇవన్నీ మరుసటి రోజుకు చెత్తగా మారి డ్రైనేజీల్లోకి చేరి కాలుష్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. అధికారులు రెండేళ్ల క్రితం తనఖీలు చేసి పెద్ద ఎత్తున ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులను స్వాధీనం చేసుకున్నారు. అంతే అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్లాస్టిక్ నిషేధం ఉందన్న విషయాన్ని సైతం అధికారులు మరచి పోయారు. పర్యావరణ పరిరక్షణ చట్టం 1986లో భాగంగా ప్లాస్టిక్ ఉత్పత్తులు, వినియోగంపై జిల్లాలో పలు చోట్ల నిషేధాజ్ఞలను అమలు చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై అధికారులు కొంత కాలం పాటు అవగాహన కల్పించారు. అమ్మకాలపై మొదట్లో కొరడా ఝుళిపించారు. ఆ తర్వాత నిషేధంపై అధికారులు అంతగా పట్టించుకోకుండా వదిలేశారనే విమర్శలు వస్తున్నాయి. ప్లాస్టిక్ నిషేధం ప్రకటనలు, ప్రచారానికి మాత్రమే పరిమితమైనట్లు కనిపిస్తోంది. ఎక్కడికక్కడ యథేచ్ఛగా ప్లాస్టిక్ సంచులను విచ్చలవిడిగా అమ్మకాలు జరుపుతున్నారు. ఈ వ్యవహారాన్ని అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలను అధికారులు ఎదుర్కొంటున్నారు. 50 మైక్రాన్ల కన్నా తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ కవర్ల నిషేధాన్ని ఉమ్మడి జిల్లాలో అనంతపురం నగరపాలక సంస్థతో పాటు అన్ని మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లో అధికార యంత్రాంగం అమల్లోకి తీసుకొచ్చింది. నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ విక్రయిస్తున్న వ్యాపారులకు భారీగా జరిమానా విధించడానికి సైతం వెనుకాడమని, వరుసగా రెండు సార్లు పట్టుబడితే దుకాణాలను సీజ్ చేస్తామని కూడా అప్పుడు చెప్పుకొచ్చారు. కానీ ఆచరణలో అనేక చోట్ల ప్లాస్టిక్ వినియోగం యథావిధిగా జరిగిపోతుంది. కానీ అధికారుల చర్యలు ఎక్కడా కానరావడం లేదు.



అధికారులు స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ కవర్లు (ఫైల్ ఫోటో)

పట్టణంలో మితిమీరిన వినియోగం

హిందూపురం పట్టణంలో ప్లాస్టిక్ వినియోగం ప్రస్తుతం హద్దులు దాటింది. బహిరంగ మార్కెట్లలో ప్లాస్టిక్ సంచులు, గ్లాసులు మితిమీరి వినియోగిస్తున్నారు. వాటిని రోడ్లపై, కాలువల్లో పడేస్తుండటం వల్ల మురుగు కాలువల్లో మురుగు ముందుకు పోవడం లేదు. రోడ్లపై వ్యర్థాలను ప్లాస్టిక్ సంచుల్లో వేయడం వల్ల వాటిని తిన్న ఆవులు, పందులు, కుక్కలు జీర్ణవ్యవస్థ పని చేయక మృతిచెందుతున్నాయి. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మరణించిన జీవాల్లో 90 శాతం ఇదే కారణంగా ఉన్నట్లు పశుసంవర్థక శాఖ తేల్చింది. పెట్రో కెమికల్ ద్వారా తయారయ్యే ప్లాస్టిక్ కవర్లలో వేడి పదార్థాలు వేయడం వల్ల కార్సినోజెనిక్ అనే ఉత్పాదిక రసాయనం విడుదలై కేన్సర్ సోకే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయినప్పటికి కొంతమంది ఇడ్లీ తయారీలో, టీ, కాఫీ పార్సిల్‌లో సైతం దీనిని వినియోగిస్తున్నారు. భూమిలో వందేళ్లయినా కరగని ఏకైక వస్తువు ప్లాస్టిక్‌గా గుర్తించిన కొన్ని అధ్యయన సంస్థలు దీనిని పూర్తిగా నిషేధించాలని సూచిస్తున్నాయి.

తనిఖీలతో సరి..

పురపాలక సంఘంలో ప్లాస్టిక్‌పై నిషేధాజ్ఞలు పెట్టినప్పుడల్లా కొందరు అధికారులకు అవి ఆదాయ వనరులుగా మారుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. గతంలో రెండుసార్లు ప్లాస్టిక్‌పై నిషేధం విధించిన మున్సిపల్ అధికారులు ఆకస్మిక దాడులతో కొన్ని రోజులు హడావుడి చేసి వదిలేశారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లలో ప్లాస్టిక్ సంచులు యథేచ్ఛగా దర్శనమిస్తున్నాయి.

నిషేధిత ప్లాస్టిక్ వాడకూడదు



భారత ప్రభుత్వం కొన్ని ప్లాస్టిక్ వస్తువులను నిషేధించింది. వాటిని పూర్తిగా వాడకూడదు. ఒక్కసారి వినియోగించి పడేసే కవర్లపైనే మా దృష్టంతా. బహిరంగ మార్కెట్లలో ప్లాస్టిక్ వినియోగంతో పాటు ఉత్పత్తిపైన నిఘా పెడుతున్నాం. పట్టణ వ్యాప్తంగా ఆకస్మిక దాడులకు బృందాలను ఏర్పాటు చేస్తాం. దశలవారీగా వార్డు సచివాలయాల పరిధిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ప్రజలను చైతన్య వంతులను చేస్తాం. ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటాం.ఇందుకు ప్రజల సహకారం ముఖ్యం.

శ్రీకాంత్ రెడ్డి,
హిందూపురం మున్సిపల్ కమిషనర్



విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

'ఉపాధి'ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలి

ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ఉపాధి హామీ చట్టాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పని దినాలను 200 రోజులకు పెంచాలని, పనిముట్లు, రోజుకు వేతనం రూ. 600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. వలస వెళ్లిన కూలీలను సొంత ఊళ్లకు రప్పించి వారందరికీ జాబ్‌కార్డులు ఇచ్చి పని దినాలు కల్పించాలన్నారు. ఈ నెల 23వ తేదీ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామసభల్లో చిన్న సన్న కారు రైతులు, పేదలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సిఐటియు నాయకులు జెవి రమణ, ఎన్‌హెచ్ బాషా, సిపిఎం పట్టణ కార్యదర్శి శేషంపల్లి మారుతి, చేనేత నాయకులు వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

'పోస్టాఫీసులో పొదుపు సొమ్ము కాజేశారు'

ప్రజాశక్తి - ఓబుళదేవరచెరువు

నెల నెలా కొంత డబ్బు పోస్టాఫీస్‌లో పొదుపు చేస్తే తన ప్రమేయం లేకుండానే పోస్టాఫీస్ సిబ్బంది రుణం పేరుతో కాజేశారని మండలంలోని వీరప్పగారిపల్లికి చెందిన బి.చిన్నమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కొండకమర్ల పోస్టాఫీస్‌లో 2019 డిసెంబర్ నుంచి ప్రతి నెలా రూ. 500 చొప్పున ఆర్‌డి కడుతున్నా అన్నారు. ఈ నెల 5వ తేదీ తాను సంతకం చేయకపోయినా పోస్టాఫీస్ సిబ్బంది రుణం పేరుతో రూ. 14వేలు కాజేశారని వాపోయింది. ఈ విషయంపై పోస్టాఫీస్‌కి వెళ్లి అడిగితే సరిగా సమాధానం చెప్పలేదని, ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరుతుంది.

అసైన్డ్ భూములను రీ వెరిఫికేషన్ చేయాలి : జెసి

ప్రజాశక్తి-బత్తలపల్లి

గత ప్రభుత్వంలో అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు(ఫ్రీ హోల్డ్) పొందిన రైతుల భూములను మరోసారి రీ వెరిఫికేషన్ నిర్వహించి త్వరితగతిన నివేదికలు అందజేయాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ విసయంపై జెసి బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. జెసి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చట్ట సవరణ ద్వారా ఫ్రీ హోల్డ్ అయిన అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్లను ప్రస్తుత ప్రభుత్వం నిలిపివేయాలని ఆదేశాలు ఇచ్చిందన్నారు. కావున ఈ భూములపై మరోసారి విచారణ చేపట్టి త్వరిత గతిన సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. డీ పట్టా ఎవరి పేరున ఉంది? ఎవరి పేరుతో మార్పు జరిగింది? తదితర వివరాలను నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. పలు అంశాలపై సూచనలు, సలహాలు అందజేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అందిన వినతులను వేగవంతంగా పరిష్కరించాలని, ఏమాత్రం నిర్లక్ష్యం చేయవద్దన్నారు. అంతకుముందు నివేదికల ప్రకారం భూముల వివరాలను స్వయంగా జెసి పరిశీలించారు. సమావేశంలో భూ సర్వే తహశీల్దార్ సునీత, అధికారులు బి.శారద పాల్గొన్నారు.

23 నుంచి జిల్లా వ్యాప్తంగా గ్రామసభలు



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రత్యేక అధికారులు విధిగా పాల్గొనాలి
కలెక్టర్ టిఎస్. చేతన్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 23 నుంచి గ్రామ సభలు నిర్వహించాలని ఇందులో మండల ప్రత్యేక అధికారులు పాల్గొనాలని కలెక్టర్ టిఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. గ్రామసభలు నిర్వహణ సమస్యల పరిష్కారం అన్న అంశాలపై సంబంధిత అధికారులకు బుధవారం కలెక్టరేట్ నుంచి దిశా నిర్దేశం చేశారు. టెలికాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన వినతులపై క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం చేయాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి, స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి వచ్చే వినతులను క్షేత్రస్థాయిలో పర్యటించి పరిష్కరించాలన్నారు. గ్రామసభలలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, ఉపాధి హామీ పథకం గ్రామాల్లో కూలీలకు వంద రోజులు పని కల్పించే విధంగా తెలపాలని అన్నారు. ప్రతి పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకాన్ని అధికారులు పరిశీలించాలని సంక్షేమ వసతి గృహాలను సందర్శించి తనిఖీలు చేయాలని చెప్పారు. తాగునీటి సరఫరాలో ఎక్కడా పైపులైను లీకేజీ కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈవోఆర్డీలు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేసి నీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. మీడియాలో వచ్చే ప్రతికూల వార్తలపై సమగ్ర విచారణ జరిపి నివేదికలు తనకు అందజేయాలని ఆదేశించారు. జిల్లాలో అక్రమ లేఅవుట్లకు నోటీసులు ఇచ్చి క్రయవిక్రయాలు జరగకుండా రిజిస్టర్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. అందుకు డిపిఒ, హుడా అధికారులు సంయుక్తంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు

బ్యాంకర్లు నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలి : కలెక్టర్

రైతులకు, విద్యార్థులు, ఎస్ సి, ఎస్ టి, బిసి, మైనార్టీలకు స్వయం సహాయక సంఘాలకు నిర్దేశించిన లక్ష్యాల మేరకు బ్యాంకర్లు రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ టిఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో త్రైమాసిక ఆర్థిక సంవత్సరంనకు సంబంధించి జిల్లాస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు బ్యాంకర్లతో సమన్వయం చేసుకొని అర్హత కలిగిన వారికి రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. కేంద్ర ఆర్థిక అక్షరాస్యత కేంద్రాలతో సంబంధిత అధికారులు భాగస్వాములై పురోగతి సాధించాలన్నారు. ముఖ్యంగా కౌలు రైతులు, విద్యార్థులు, పండ్ల తోటల పెంపకం, పశు పోషణ, చేనేతలు, మత్స్యకారులు, మహిళా పొదుపు సంఘాలు, యువత ఉపాధి కల్పనకు ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారికి విరివిగా రుణాలు అందించాలని ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని బ్యాంకర్లకు సూచించారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ లకు సంబంధించిన పథకాలన్నీ అమలు చేయాలన్నారు. పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే యువతను ప్రోత్సహించాలన్నారు. అగళి, సోమందేపల్లి, ప్రాంతాల్లో జాతీయ బ్యాంకుల ఏర్పాటుకు చర్యలు తీసుకొని వాణిజ్య వ్యాపార రంగాలను ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వ ప్రయోజిత రుణాలు మంజూరు సబ్సిడీ అంశాలు రుణాల వసూళ్లు తదితర విషయాల్లో డిఆర్‌డిఎ, మెప్మా శాఖలు బ్యాంకర్లకు సహకరించాలన్నారు. జిల్లాలోని బ్యాంకులలో రూ.10,183 కోట్ల డిపాజిట్లు ఉండగా రూ. 17, 260 కోట్లు వివిధ రీతులలో రుణాలు మంజూరు చేశారని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జిఎం చాంద్ భాషా, వ్యవసాయ అధికారి సుబ్బారావు, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్, జౌళి శాఖ అధికారి రమేష్, ఆర్‌బిఐ ఎల్‌డిఎం గిరినాథ్, నాబార్డ్ డీడీఎం అనురాధ, ఏపీజీబీ రీజినల్ మేనేజర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తిలో పందుల స్వైర విహారం

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి పట్టణ కేంద్రంలో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. బుధవారం పట్టణంలోని మునిసిపల్ కార్యాలయానికి కూతవేటు దూరంలో చిత్రావతి బ్రిడ్జి వద్దకు వెళ్లే రహదారిలో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తిలో ఇలా పందులు స్వైర విహారం చేయడంతో సత్య సాయి బాబా సమాధి దర్శనార్థం వచ్చే దేశ విదేశీ భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పందుల వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఒక్కొక్కసారి ఇళ్లలోకి వస్తున్నాయని అధికారులకు చెప్పిన పట్టించుకోలేదని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పట్టణంలోకి పందులు రాకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



చెత్తకుప్పల్లో పందుల స్వైర విహారం

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని శాసనసభ్యురాలు పల్లె సింధూర రెడ్డి మున్సిపల్ కమిషనర్ అంజయ్యకు సూచించారు. ఈ మేరకు ఆమె పట్టణంలో తాగునీటి సమస్యపై బుధవారం మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. పుట్టపర్తి నగరంలో తాగునీటి ఎద్దడి నివారణకు తక్షణం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద కమ్మవారిపల్లి, బీడుపల్లి, వివేకానంద నగర్, ఎనుమల పల్లి, శిల్పారామం తదితర ప్రాంతాల్లో మోటార్లు కాలిపోయి తాగునీటి సమస్య తో ప్రజలు ఇబ్బంది పడుతున్నట్లు తనకు అనేక ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. ఎక్కడెక్కడ నీటి సమస్య ఉందో గుర్తించి సత్వరమే ప్రజలకు పరిష్కారం చూపాలని ఆదేశించారు. పుట్టపర్తిలో నెలకొన్న తాగునీటి సమస్యపై పుట్టపర్తి పుర ప్రజలు బుధవారం పుట్టపర్తిలో పర్యటించిన మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి దృష్టికి కూడా తీసుకొచ్చారు. వెంటనే మున్సిపల్ కమిషనర్ అంజయ్యని పిలిపించి పుట్టపర్తి లో ఎక్కడ త్రాగునీటి సమస్య రాకుండా చూడాలని కోరారు.

జాతీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-హిందూపురం

సెప్టెంబర్ 1, 2, 3వ తేదీలలో విశాఖపట్నంలో జరుగుతున్న ఎఐటియుసి జాతీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని ఆసంఘం జిల్లా నాయకులు వినోద్ కుమార్, ఆంజనేయులు పిలుపునిచ్చారు. బుధవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో ఉన్న మున్సిపల్ జేఏసీ కార్యాలయం ముందు ఎఐటియుసి జాతీయ సమ్మేళనాల గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చలపతి, ఏఐటీయూసీ పట్టణ ఉపాధ్యక్షులు సురేష్, సమీవుల్లా, సహాయ కార్యదర్శులు నౌషాద్, కమల్ బాషా, జమీర్ తదితరులు పాల్గొన్నారు.

పేట్రేగిన మట్టి మాఫియా

చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి ప్రాంతంలోని పచ్చని కొండ ప్రాంతాలు స్వార్థపరుల కారణంగా కరిగిపోతున్నాయి. స్వార్థపరులు రోజు రోజుకు కొండలను మింగేస్తూ పర్యావరణాన్ని కలుషితం చేస్తున్నారు. కదిరి పరిసర ప్రాంతాల్లోని సహజ సంపదను వందల వాహనాల్లో తరలిస్తూ కొండలను రోజురోజుకు కనుమరుగుచేస్తున్నారు. ఎర్రమట్టి మాఫీయా కొండలు గుట్టలను తమ కబంధ హస్తాలతో కబళిస్తోంది. రోజుకు వందల వాహనాల్లో ఎర్రమట్టిని తరలిస్తూ కాసుల వర్షం కురిపించుకుంటున్నారు. పాలకులు, అధికారులు స్పందించి ప్రభుత్వం సహజ వనరులను కాపాడేలా పర్యావరణాన్ని పరిరక్షించేలా దృష్టి సారించి మట్టి మాఫియాకి అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.



మట్టిని ఇటాచీతో తవ్వుతున్న దృశ్యం

ప్రజల ప్రాణాలు కాపాడే డాక్టర్లకే రక్షణ లేదా?

జూనియర్ డాక్టర్ ఘటనపై సిఐటియు నిరసన ర్యాలీలు, మానవహారాలు, కొవ్వొత్తుల ప్రదర్శన

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

ప్రజల ప్రాణాలు కాపాడే డాక్టర్లకి రక్షణ లేదా అని సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ ప్రశ్నించారు. జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం సంఘటనను ఖండిస్తూ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం హంతకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీలు నిరసన కార్యక్రమం చేపట్టారు. పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకూ ర్యాలీ నిర్వహించి అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. రమేష్ మాట్లాడుతూ జూనియర్ డాక్టర్ సంఘటనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని సిఐటియు తీవ్రంగా ఖండిస్తుందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హరి, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి హర్ష, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు జయమ్మ, కార్యదర్శి బావమ్మ, కోశాధికారి మాబున్నిసా, సెక్టార్ లీడర్లు శ్యామల గౌరి, పార్వతి, పద్మ, సరస్వతి, లక్ష్మీదేవి, శాంతిబాయ్, అనూష, అనిత, తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : జూనియర్ డాక్టర్‌ను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని సిఐటియు నాయకులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు డిమాండ్ చేశారు. అనంతరం సిఐటియు మండల కార్యదర్శి పైపల్లి గంగాధర్ ఆధ్వర్యంలో తహశీల్దార్ అనుపమకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కో కన్వీనర్ బాబా, సుధాకర్, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గోరంట్ల : స్థానిక ఉదయ్ కిరణ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఆధ్వర్యంలో పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ క్యాడెట్లు గుమ్మయ్యగారిపల్లి నుంచి గోరంట్లలోని గాంధీ సర్కిల్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో విద్యార్థులు ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం మధుసూదన్, ఉపాధ్యాయులు జరీన, భారతి, పార్వతి, చెన్నకేశవులు, పిఈటి మధు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



పెనుకొండలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీ

ముదిగుబ్బ : సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, బాబు ఆధ్వర్యంలో సిపిఎం, సిఐటియు నాయకులు, అంగన్వాడీ కార్యకర్తలు విద్యుత్ కార్యాలయం నుంచి జాతీయ రహదారిపై ర్యాలీగా వచ్చి నాలుగు కూడళ్ల సర్కిల్‌లో రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బండల వెంకటేష్, పోతులయ్య, అంగన్వాడీ అధ్యక్షురాలు రజియా, ఆవాజ్ కమిటీ కార్యదర్శి బాబ్‌జాన్, రఫీ, టైలర్ ముత్తు నాగప్ప, లక్షమన్న, మునాఫ్,, తదితరులు పాల్గొన్నారు.


కదిరిలో కొవ్వొత్తుల ప్రదర్శన

కదిరి టౌన్ : సిఐటియు నాయకులు జగన్మోహన్, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మాబున్నీసా ఆధ్వర్యంలో సాయంత్రం పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద కొవ్వొత్తుల తో నిరసన ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు జివిఎల్ నరసింహులు, ప్రజా సంఘాల నాయకులు, బాబ్‌జాన్, ముస్తాక్, రామ్మోహన్, నారాయణ, మహిళలు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : సిఐటియు మండల కన్వీనర్ జెవి రమణ ఆధ్వర్యంలో స్థానిక కళాజ్యోతి సర్కిల్‌లో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ అంబేద్కర్ విగ్రహం వద్ద మోకాళ్లపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పెద్దన్న, సిఐటియు మండల కోకన్వీనర్ ఎల్. ఆదినారాయణ, అంగన్వాడీలు చంద్రకళ, సరస్వతి, నూర్జహాన్, నాగేశ్వరి, ఫాతిమా, పోతక్క, లలిత పాల్గొన్నారు.

లేపాక్షి : సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు నిరసన ర్యాలీ చేపట్టి మానవహారంగా ఏర్పడ్డారు. నిందితులను వెంటనే గుర్తించి బహిరంగంగా ఉరి తీయాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హిందూపురం ప్రాజెక్టు కార్యదర్శి లావణ్య, సిఐటియు నాయకులు రాజప్ప, సెక్టార్ లీడర్లు ధనమ్మ, భాగ్యమ్మ, శశికళ, రూపా, రత్నమ్మ, సుజాతమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.


చిలమత్తూరులో మానవహారం

చిలమత్తూరు : సిఐటియు మండల నాయకులు రామచంద్ర, వెంకటేష్ ఆధ్వర్యంలో అంగన్వాడీలు ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో వ్యకాసం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, సిఐటియు లక్ష్మీనారాయణ, అంగన్వాడీ యూనియన్ నాయకురాళ్లు శోభమ్మ, రామతులశమ్మ, ఈశ్వరమ్మ, అక్కనాగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : జూనియర్ డాక్టర్, మహిళా గొర్రెల కాపరిని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ చేస్తూ అంగన్వాడీ యూనియన్ ఆధ్వర్యంలో ప్రధాన వీధుల్లో నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. ఎన్టీఆర్ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా కోశాధికారి శ్రీదేవి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

హిందూపురం : ఎహెచ్ఒ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని సువర్ణభారతి, బాలయేసు, ఎన్ లైట్, సప్తగిరి డిగ్రీ కళాశాలల విద్యార్థినులు ప్లకార్డులు చేతబూని నిరసన ర్యాలీ చేశారు. ర్యాలీ చిన్న మార్కెట్ సర్కిల్ నుంచి ప్రారంభమై మెయిన్ బజార్, గాంధీ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా అంబేద్కర్ సర్కిల్ వరకూ కొనసాగింది. అక్కడ విద్యార్థినులు మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ పురం అధ్యక్షులు బాలకృష్ణ, సభ్యులు బాలాజీ, మోహన్‌సాయి, మహేష్, దినేష్, దేవరాజ్, రాజా, బాబా సోహెల్, అధ్యాపకులు, విద్యార్థినులు, ప్రజా సంఘాల నాయకులు, పాల్గొన్నారు.

గుడిబండ : ఐసిడిఎస్, ఆర్‌డిటి, ఎంజెపి కళాశాల సిబ్బంది గుడిబండలో నిరసన ర్యాలీ నిర్వహించి బస్టాండులో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఒ పద్మావతి, ఆర్‌డిటి రీజినల్ డైరెక్టర్ మల్లికార్జున, ఎంజెపి కళాశాల ప్రిన్సిపల్ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

తలుపుల : స్థానిక మూడు రోడ్ల కూడలిలో ప్రజలు కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ఎస్ఎంసి ఛైర్మన్ ఎద్దుల రాముడు, జివి రమణ, విశ్వనాథ్, బాబు, కుళ్లాయప్ప, శివశంకర, వన్నూరప్ప, రమణ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ బంద్

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా మాలలు, వివిధ రాజకీయ పార్టీలు ఇచ్చిన భారత్‌బంద్‌లో భాగంగా బుధవారం జిల్లా వ్యాప్తంగా బంద్ పాటించారు. కదిరి పట్టణంలో మాల మహానాడు నాయకుల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి చౌక్ బజార్ వరకూ ర్యాలీ చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ ఎస్సీ ఉప వర్గీకరణ చేస్తే మాలలు అధిక సంఖ్యలో నష్టపోతారని, కోర్టు తీర్పును పున:పరిశీలించాలని, రిజర్వేషన్‌లో ప్రస్తుతం ఉన్న కోటాను యథాతథంగా అమలు చేయాలని, ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు వెళ్లవద్దని డిమాండ్ చేశారు. వారు అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తుండగా పట్టణ సిఐ నారాయణరెడ్డి, ఎస్ఐ రాము, పోలీసులు వారికి సర్ది చెప్పి విరమింపజేశారు. కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు పిచ్చల రామచంద్ర, రాష్ట్ర కమిటీ సభ్యుడు రామచంద్ర, జిల్లా ఉపాధ్యక్షులు పి.గోపాల్, శివన్న, కదిరప్ప, నరేష్, త్యాగరాజు, రాజు, చంద్రమౌళి, బాలముణి, శ్యామ్, సూర్యనారాయణ, బాల వేమయ్య, సుందర్, ఆంజనేయులు, కె.నారాయణ స్వామి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : మాల మహానాడు జెఎసి కో కన్వీనర్ రామాంజనేయులు ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలను మూయించారు. ఆయన మాట్లాడుతూ పార్లమెంటులో చట్టం చేసి ఎస్సీ వర్గీకరణ చేయాలని, అలాకాకుండా సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారాలు అప్పగించడం సబబు కాదన్నారు. అనంతరం ర్యాలీగా వెళ్లి తహశీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు గిరిబాబు, గోపి, ప్రసాద్, గోపాల్, ఆంజనేయులు, నాగేంద్ర, నరసింహులు, సుబ్బరాయుడు, చంద్రశేఖర్, పుష్పరాజు, గంగాద్రి, సల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.


కొత్తచెరువులో తహశీల్దార్ నాగరాజుకు వినతిపత్రం ఇస్తున్న మాలమహానాడు నాయకులు

అమరాపురం : దేశ వ్యాప్తంగా కుల గణన ఆధారంగా రిజర్వేషన్లను పెంచాలని మాల మహానాడు నాయకులు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ రజత కుమారికి వినతి సమర్పించారు. కార్యక్రమంలో మాల మహానాడు నియోజకవర్గ అధ్యక్షుడు పాండురంగమూర్తి, గౌరవాధ్యక్షులు జయరామప్ప, మహిళా కార్యదర్శి నాగరత్నమ్మ, సభ్యులు నాగరాజు, మారుతి ప్రసాద్, హరీష్, నరసింహమూర్తి, ఉపాధ్యాయ సంఘం నాయకులు పాల్గొన్నారు.

మడకశిర : మాల మహానాడు సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన బంద్‌కు ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలు, కార్యాలయాలు, బ్యాంకులు స్వచ్ఛందంగా మద్దతు తెలిపి బంద్ పాటించాయి. కార్యక్రమంలో సోమకుమార్, సోమన్న, బసవరాజు, కృష్ణమూర్తి, మూర్తి, గంగాధర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

బలవంతపు సర్దుబాట్లు తగదు : యుటిఎఫ్

ప్రజాశక్తి-కొత్తచెరువు

అసంబద్ధంగా, అప్రజాస్వామికంగా చేపట్టిన ఉపాధ్యాయుల పని సర్దుబాటు కార్యక్రమాన్ని యుటిఎఫ్ జిల్లా శాఖ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శెట్టిపి జయచంద్రారెడ్డి, సుధాకర్ తెలిపారు. సర్దుబాటులోని లోపాలను సరి చేయాలని బుధవారం వారు డిఇఒ కార్యాలయంలో ఎడి నాగరాజుకి విజ్ఞప్తి చేశారు. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల అభ్యంతరాలను అధికారులు పరిగణలోకి తీసుకోకపోతే జీవో-2 ఎందుకు ఇచ్చారని ప్రశించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు లక్ష్మినారాయణ, నరేష్‌కుమార్, బాబు, బాబావలి పాల్గొన్నారు.


ఎడి నాగరాజుకి వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు

సరైన పద్ధతిలో సర్దుబాటు జరగాలి: వైఎస్ఆర్‌టిఎ

పుట్టపర్తి క్రైమ్ : ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ ఒక్కో మండలంలో ఒకలా జరుగుతోందని, అలాకాకుండా శాస్త్రీయ పద్ధతిలో అందరికీ ఆమోదయోగ్యమైన పద్ధతిలో సర్దుబాటు చేయాలని వైఎస్ఆర్ టీచర్స్ ఫెడరేషన్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పివి.రమణారెడ్డి, ఇంద్రప్రసాద్ మాట్లాడుతూ స్కూల్ అసిస్టెంట్లను ముందుగా మండల స్థాయిలో సర్దుబాటు చేసి తదుపరి మిగిలిపోయిన స్కూల్ అసిస్టెంట్లను డివిజనల్, జిల్లా స్థాయిలో సర్దుబాటు చేయాలన్నారు. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులను మండల స్థాయిలో సర్దుబాటు చేసి నాల్గవ దశలో మిగిలిపోయిన వారిని డివిజనల్, జిల్లా స్థాయిలో చేయాలన్నారు.


ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులతో ట్రస్టు సభ్యులు, ఉపాధ్యాయులు

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి : డిఇఒ

ప్రజాశక్తి-కొత్తచెరువు

విద్యార్థులు క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని డిఇఒ మీనాక్షి సూచించారు. జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని కొత్తచెరువు, బుక్కపట్నం, పుట్టపర్తి మండలాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల్లోని 6-10 తరగతి విద్యార్థులకు ఆత్మీయ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో అండర్-14, అండర్-17 విభాగాల్లో వంద, 200 మీటర్ల పరుగు పందెం పోటీలు నిర్వహించారు. డిఇఒ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి చూపాలన్నారు విద్యార్థి దశ నుంచే క్రీడల్లో పాల్గొనాలని, తద్వారా మానసికంగా, శారీర కంగా అభివృద్ధి సాధిస్తారన్నారు. పోటీల్లో మొత్తం 265 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు ఎంఇఒ లు రెడ్డప్ప, జయచంద్ర బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఛైర్మన్ శెట్టిపి జయచంద్రారెడ్డి, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, టోర్నమెంట్ కన్వీనర్ వెంకటరమణ, మహేందర్ రెడ్డి, ఎపిటిఎఫ్ హరిప్రసాద్‌రెడ్డి, యుటిఎఫ్ నాయకులు లక్ష్మీనారాయణ, బాబు, మురళి, చాంద్‌బాషా, ఆదినారాయణ, పిఇటిలు రామకృష్ణ, వెంకటేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయి

మాజీ మంత్రి ఉషశ్రీచరణ్

ప్రజాశక్తి-సోమందేపల్లి

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని మాజీ మంత్రి, పెనుకొండ నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి ఉషశ్రీ చరణ్ విమర్శించారు. ఆమె బుధవారం మండలంలోని మేకలపల్లి, నాగినాయన చెరువు, బుసయ్యగారిపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై లైంగిక దాడులు, హత్యలు జరుగుతున్నా ప్రభుత్వంలో చలనం లేదని, అరికట్టడంలో రాష్ట్ర హోం మంత్రి విఫలమయ్యారని మండిపడ్డారు. పెనుకొండ నియోజక వర్గంలో బిసి సర్పంచులు, నాయకులు, కార్యకర్తలపై టిడిపి శ్రేణులు దాడులు చేస్తుంటే బిసి మంత్రి నియంత్రించకపోవడం బాధాకరమన్నారు. పోలీసులు కూడా ప్రేక్షక పాత్ర పోషించడం తగదన్నారు. పార్టీ శ్రేణులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. జూనియర్ డాక్టర్ సంఘటనను వైసిపి ప్రభుత్వం తరపున ఖండిస్తున్నామన్నారు. దోషులను కఠినంగా శిక్షించాలని కోల్‌కతా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంతకుముందు బ్రహ్మసముద్రం సర్పంచి పరంధాములు, అతని తమ్ముడి ముత్యాలును కలిసి దాడి గురించి ఆరా తీశారు. నాగినాయనిచెరువులో వైసిపి నాయకులు జగదీశ్ తల్లి మృతిచెందగా కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె వెంట జడ్పీటీసీ డిసి అశోక్‌కుమార్, సర్పంచులు పరంధాములు, అంజినాయక్, జిలాన్, మండల ఉపాధ్యక్షులు వెంకటనారాయణరెడ్డి, కో ఆప్షన్ సభ్యులు రఫీక్‌సాబ్, ఎంపీటీసీ నాగప్ప, నాయకులు ఉన్నారు.


పార్టీ నాయకులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్

ఎన్నికల హామీల అమలుపై ప్రశ్నిద్దాం

పరిగి : ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం వైసిపి ఆధ్వర్యంలో ప్రజల పక్షాన కూటమి ప్రభుత్వంపై పోరాడేందుకు సిద్ధంగా ఉండాలని మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ పిలుపునిచ్చారు. ఆమె మండలంలోని శీరేకోలం, పి.నరసాపురం గ్రామాల్లో నిర్వహించిన కార్యకర్తల సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉంటానని, ఏ సమస్య వచ్చినా తనను కలవ వచ్చు అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న సమస్యలతో పాటు ప్రభుత్వ వ్యతిరేకతను ప్రజల్లోకి తీసుకెళ్దామని, ప్రజలకు అందుబాటులో ఉండి పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచి ప్రభాకర్, మండల కన్వీనర్ నరసింహమూర్తి, పైడేటి ప్రభాకర్ పాల్గొన్నారు.

పరిగి ఎస్ఐగా రంగడుయాదవ్



పరిగి : నూతన ఎస్ఐగా రంగడు యాదవ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ సత్యనారాయణ విఆర్‌కి వెళ్లారు. పెనుగొండ కియా పోలీస్ స్టేషన్ ఎస్ఐగా ఉన్న రంగడుయాదవ్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. నూతన ఎస్ఐ ఎఎస్ఐ, కానిస్టేబుళ్లతో సమావేశం నిర్వహించారు. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణపై అప్రమత్తంగా ఉండి పని చేయాలని సూచించారు. గ్రామాల్లో మట్కా, పేకాట, తదితర అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే తక్షణమే తమకు సమాచారం అందించాలన్నారు. మండలంలో గతంలో పనిచేసిన అనుభవం ఉందని, ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించి ప్రతి ఫిర్యాదుదారుడికి న్యాయం చేస్తానని తెలిపారు.

ప్రత్యామ్నాయ పంటలు వేసుకోండి

ముదిగుబ్బ : కొన్నిరోజులుగా వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయని, రైతులు ప్రత్యామ్నాయ పంట లు సాగు చేయాలని జిల్లా ఉద్యాన అధికారి చంద్రశేఖర్, వ్యవసాయ సహాయ సంచాలకులు సత్య నారాయణ, వ్యవసాయ అధికారి లక్ష్మినరసింహులు సూచించారు. వారు బుధవారం మండలం లోని గరుగుతండా గ్రామంలో పర్యటించి పంట నమోదు, దాని ఉపయోగాలను రైతులకు వివరించారు. ప్రత్యామ్నాయ విత్తనాలను ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తుందని, సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వారి వెంట ఎఇఒ షరీఫ్, ఎంపిఇఒ నాగరాజు, రైతులు ఉన్నారు.

పిహెచ్‌సికి ప్రహరీ నిర్మించాలని వినతి

ప్రజాశక్తి-లేపాక్షి

స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం (పిహెచ్‌సి) చుట్టూ ప్రహరీ నిర్మించాలని కోరుతూ బుధవారం టిడిపి మండల కన్వీనర్ జయప్ప ఆధ్వర్యంలో తహశీల్దార్ సౌజన్యలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గతంలో రోడ్డు నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్లు ప్రహరీని తొలగించారని తెలిపారు. స్పందించిన తహశీల్దార్ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కోడిపల్లి ఎంపిటిసి గంగాధర్, నాయ కులు అశ్వర్థనారాయణ పాల్గొన్నారు..


విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న జయప్ప

జూనియర్ కళాశాల విద్యార్థులకు బ్యాగులు పంపిణీ

లేపాక్షి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ప్రిన్సిపల్ బాషా సమక్షంలో టిడిపి మండల కన్వీనర్ జయప్ప విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. జయప్ప మాట్లాడుతూ సిఎం చంద్రబాబు కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలను తీర్చిదిద్దుతారన్నారు. ఎంఇఒలు నాగరాజు, కుళ్లాయప్ప మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలన్నారు. కార్యక్రమంలో కోడిపల్లి ఎంపిటిసి గంగాధర్, నాయకులు షేక్షావలి, ఉపన్యాసకులు అనిత కుమారి, శ్రీదేవి, క్రిష్టప్ప, ఆదినారాయణ, శిరీష, సిబ్బంది పాల్గొన్నారు.

వాల్మీకి కళ్యాణమండపం నిర్మాణానికి స్థల పరిశీలన

పరిగి : స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో వాల్మీకి కళ్యాణమండపం నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని బుధవారం ఎంపి పార్థసారధి పరిశీలించారు. ఎంపి మాట్లాడుతూ వాల్మీకి భవన నిర్మాణానికి హిందూపురం ఎంపి నిధుల ద్వారా రూ. కోటి మంజూరు చేస్తామని తెలిపారు. తొలి విడతగా రూ. 25 లక్షలు ఇస్తామని, వాటితో త్వరలోనే పనులు ప్రారంభించాలని తెలిపారు. కార్యక్రమంలో వాల్మీకి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈశ్వరప్ప, నాగరాజు, నంజుండప్ప, శేఖర్, నరసింహప్ప, కుమార్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయండి

ధర్మవరం టౌన్ : అతిసార, సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమార్, మలేరియా సబ్ యూనిట్ అధికారి జయరామ్‌నాయక్ అధికారులకు సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ భవనంలో బుధవారం ఎఎన్ఎం, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. వ్యాధుల నివారణకు జాగ్రత్తలను వివరించాలన్నారు. పరిశుభ్రమైన తాగునీరు, పారిశుధ్యం మెరుగు చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలకు ఎప్పటికప్పుడు వైద్యసేవలు అందించాలన్నారు. సమావేశంలో డిపిఎంఒ చిన్నకుళ్లాయప్పనాయక్, అసిస్టెంట్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, బిజెపి నాయకులు హరీశ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రీస్కూల్ సంసిద్ధత కార్యక్రమం

పెనుకొండ : పట్టణంలోని ఆల్విన్ కాలనీ అంగన్వాడీ కేంద్రంలో బుధవారం సూపర్వైజర్ పుష్పలత ఆధ్వర్యంలో ప్రీస్కూల్ సంసిద్ధత కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కేంద్రం పరిధిలోని నగ్మా కౌసర్, మౌలాల దంపతుల కుమార్తె సనం సాదియాను ప్రీ ప్రీస్కూల్‌లో చేర్పించారు. కూతురు జన్మది నం సందర్భంగా ఆ దంపతులు అంగన్వాడీ కేంద్రానికి 10 కుర్చీలు అందజేశారు. పిల్లలకు మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో ప్రీస్కూల్ పిల్లలు, వారి తల్లులు, అంగన్వాడీ కార్యకర్త రాజేశ్వరి, సహాయ కురాలు మాబున్నీసా, తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న సూపర్వైజర్ పుష్పలత

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

హిందూపురం : పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న గెస్ట్ లెక్చరర్(అతిథి అధ్యాపకులు) పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ అనురాధ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉర్దూ మీడియం హిస్టరీ, సివిక్స్, హిందీ, అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. పోస్టు గ్రాడ్యుయేషన్‌లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు ఈ నెల 24వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ముదిగుబ్బ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న జువాలజీ, కామర్స్ సబ్జెక్టులు బోధించడానికి ఆయా సబ్జెక్టుల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ కనీసం 50 శాతం మార్కులు కల్గిన అభ్యర్థులు ఈ నెల 27వ తేదీ లోపు దరఖాస్తులను కళాశాలలో అందజేయాలని ప్రిన్సిపల్ శ్రీరామరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29వ తేదీ ఇంటర్వ్యూ నిర్వహిస్తామని తెలిపారు.

డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

గోరంట్ల : పట్టణంలోని ఎస్‌పివిఎం డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు జరుగుతున్నాయని ప్రిన్సిపల్ భక్తవత్సలం తెలిపారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ బిఎ, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీకాం కంప్యూటర్స్, బిబిఎ, బిసిఎ కోర్సులకు అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. ప్రవేశం పొందడానికి ఈ నెల 23వ తేదీ వరకూ అవకాశం ఉందన్నారు.

నేడు ఉచిత గుండె వైద్యశిబిరం

మడకశిర రూరల్ : పట్టణంలోని మారుతినగర్‌లో ఉన్న ఎస్ఎల్‌వి సూపర్ మార్కెట్ పక్కన గురువారం గణేష్ కార్డియాక్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శిబిరంలో బెంగళూరుకు చెందిన డాక్టర్ ఎం.వెంకట గణేష్ వైద్యసేవలు అందిస్తారని తెలిపారు.

ఆలయ భూములను కాపాడండి

బుక్కపట్నం : స్థానిక బసవేశ్వరస్వామి ఆలయ భూములను కాపాడాలని కోరుతూ బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తహశీల్దార్ షాబుద్దీన్‌కు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా దేవదాయ శాఖకు చెందిన భూములను గుర్తించి అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రెసిడెంట్ సంజీవరాయుడు, సభ్యులు నాగభూషణం, దాసరి శ్రీనివాసులు, మల్లిరెడ్డి, గంగాధర్, బాలాజీ, ఈశ్వరప్ప, సతీష్, చంద్ర, ఆదినారాయణ, పురుషోత్తం పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం

గుడిబండ : గుడిబండ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ పద్మావతి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ టిఎస్.చేతన్ నుంచి ఉత్తమ సిడిపిఒగా అవార్డు అందుకున్నారు. దీంతో బుధవారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు ఆమెను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్‌డిటి రీజినల్ డైరెక్టర్ మల్లికార్జున, ఐసిడిఎస్ సూపర్వైజర్ కమలమ్మ, అంగన్వాడీ ప్రతినిధులు మహదేవమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

మడకశిర రూరల్ : స్థానిక ఎంఆర్‌సిలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న రంగనాథ్ పంద్రాగస్టు వేడుకల్లో ఉత్తమ కంప్యూటర్ ఆపరేటర్‌గా కలెక్టర్ టిఎస్.చేతన్ నుంచి అవార్డు అందుకున్నారు. దీంతో రంగనాథ్‌ను బుధవారం పాపసానిపల్లి జడ్పీ హైస్కూల్‌లో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు నాగరాజు, హరిప్రసాద్, వెంకటేష్, సురేష్, సి.నాగరాజు, వాణికుమారి, కైరున్‌బి, సిబ్బంది పాల్గొన్నారు.

కబ్జాలపై తహశీల్దార్‌కు ఫిర్యాదు

ధర్మవరం టౌన్ : పట్టణంలోని గూడ్స్‌షెడ్ కొట్టాలలో గతంలో టిడిపి ప్రభుత్వంలో పేదలకు ఇచ్చిన పట్టాలను ఆక్రమించుకుని సొమ్ము చేసుకుంటున్న కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని టిడిపి నాయకులు కమతం కాటమయ్య, చింతలపల్లి మహేశ్ చౌదరి, పరిశే సుధాకర్, పురుషోత్తంగౌడ్, రాళ్లపల్లి షరీఫ్, నాగూర్‌హుస్సేన్, అత్తార్ రహీం తహశీల్దార్ నటరాజుకు ఫిర్యాదు చేశారు. నాయకులు మాట్లాడుతూ గూడ్స్ షెడ్ కొట్టాలలో ఉన్న కుణుతూరు పొలం సర్వే నెంబర్ 560లో గత టిడిపి ప్రభుత్వంలో హమాలీలు, పేదలకు పట్టాలు ఇవ్వడంతో పాటు గుడి, బడికి కేటాయించిన స్థలాన్ని వైసిపి నాయకులు దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారన్నారు. అప్పటి రెవెన్యూ అధికారులను అడ్డంపెట్టుకుని పొజిషన్ సర్టిఫికెట్ సృష్టించుకుని పేదల పట్టాలు అమ్మి సొమ్ము చేసుకున్నారన్నారు. వాటిని విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. తహశీల్దార్‌ను కలిసిన వారిలో నాయకులు గంగాధర్, హోటల్ మారుతిస్వామి, షఫీ తదితరులు ఉన్నారు.



తహశీల్దార్ నటరాజుకు వినతిపత్రం ఇస్తున్న టిడిపి నాయకులు

నేరాలు ఘోరాలు

ఐచర్, బైక్‌ను ఢీకొన్న కారు.. తప్పిన ప్రమాదం

బత్తలపల్లి : అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై బుధవారం మండలంలోని కోడేకండ్ల గ్రామం వద్ద ఓ కారు ముందు వెళ్తున్న ఐచర్, బైక్‌ను ఢీ కొంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. ఐచర్ కదిరి వైపు నుంచి బత్తలపల్లి వైపు వస్తుండగా అదే సమయంలో కోడేకండ్ల గ్రామానికి చెందిన రైతు రాము ద్విచక్ర వాహనంపై పొలం వద్దకు బయల్దేరాడు. ఆ సమయంలోనే కదిరి వైపు నుంచి వేగంగా వచ్చిన కారు ఐచర్, ఆ తర్వాత బైక్‌ను వెనుక వైపు నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో రైతు రాము స్వల్పంగా గాయపడగా స్థానికులు బత్తలపల్లి ఆర్‌డిటి ఆసుపత్రికి తరలించారు. ఐచర్ వాహనం అక్కడ నుంచి వెళ్లిపోగా, కారు, ద్విచక్రవాహనం అక్కడే ఉన్నాయి.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం


హరినాథ్‌రెడ్డి

లేపాక్షి : మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన శంకర్‌రెడ్డి కుమారుడు హరినాథ్‌రెడ్డి(17) హిందూపురం పట్టణంలోని నారాయణ కాలేజీలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. అతడు మంగళవారం ఉదయం కాలేజీకి వెళ్తానని చెప్పి కల్లూరు నుంచి ఆటోలో వెళ్లి హిందూపురం అంబేద్కర్ సర్కిల్ వద్ద దిగాడు. ఆ తర్వాత కాలేజీకి వెళ్లకుండా, తిరిగి ఇంటికి రాకుండా ఎక్కడికో వెళ్లిపోయాడు. ఈ విషయమై బుధవారం సాయంత్రం తండ్రి శంకర్ రెడ్డి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. బాలుడి సమాచారం తెలిస్తే 93460 10567 నెంబర్‌కి తెలపాలని ఎస్ఐ కోరారు.

అధిక వడ్డీ వసూలుపై కేసు నమోదు

కదిరి టౌన్ : పట్టణంలో పలువురికి అప్పులు ఇస్తూ అధిక వడ్డీ వసూలు చేస్తున్న సుల్తాన్ అలియాస్ లాలిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు పట్టణ సిఐ నారాయణరెడ్డి తెలిపారు. వివ రాలు.. సుల్తాన్ అలియాస్ లాలి పట్టణంలో చిన్న షాపులు నిర్వహిస్తూ జీవనం సాగించే వారికి డబ్బు అప్పుగా ఇచ్చి వారి నుంచి వారపు వడ్డీ, నెల వడ్డీల పేరుతో అధిక వడ్డీ వసూలు చేయడం, బలవంతంగా ఖాళీ ప్రామిసరీ నోట్లు, చెక్కులు రాయించుకుని వారిపై వేధింపులు, బెదిరింపులకు పాల్పడుతున్నట్లు పట్టణంలోని వలిసాబ్ రోడ్డులోని షామీరియా స్ట్రీట్‌లో నివాసం ఉంటున్న, తలుపుల షేక్ సనాఉల్లా మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సుల్తాన్ అలియాస్ లాలీపై కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.